క్లుప్తంగా

భజన మండలి సభ్యుల నగర సంకీర్తన



శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన శ్రీరామ ఆంజనేయ భజన మండలి సభ్యులు, శ్రీ రామదాసు భజన జిల్లా అధ్యక్షుడు మాందాడి రాజు ఆధ్వర్యంలో శనివారం సంకీర్తన చేపట్టారు. ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు వీధుల్లో భక్తి గీతాలు ఆలపిస్తూ నగర సంకీర్తన చేపట్టారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలుకుతూ స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం రాజు మాట్లాడుతూ.. హిందూ ధర్మ ప్రచార పరిషత్, శ్రీరామదాసు భజన మండలి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ సిద్దేశ్వరస్వామి ఆదేశాల మేరకు తొమ్మిది సంవత్సరాలుగా శ్రావణమాసంలో నెలరోజుల పాటు గ్రామాల్లో నగర సంకీర్తనలు చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే శనివారం నగర సంకీర్తన చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ కార్యకర్తలు సురేశ్, భిక్షపతి, మండల కార్యదర్శి సదానందం, మండలి సభ్యులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ



ఆత్మకూరు : మండల కేంద్రంలోని గొల్లవాడ ప్రాథమిక పాఠశాలలో శనివారం 'మా'స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నోట్ బుక్కులు, పలకలు, స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పెండెం రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దాతలు చేయూతనందించడం అభినందనీయమని అన్నారు. అనంతరం స్వచ్ఛంద సంస్థ సభ్యులు మాట్లాడుతూ... విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలన్నారు. గురువుల మాటను గౌరవిస్తూ మంచి నడవడిక సాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు నాగబండి శివప్రసాద్, రేణుక, ఉపాధ్యాయులు పుష్పలత, నర్సింహస్వామి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌లో ఎమ్మెల్యే పరిశీలన

నర్సంపేట : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లోని భవనాన్ని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శనివారం సందర్శించి పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న రెవెన్యూ కార్యాలయాన్ని వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న భవనంలోకి మార్చే అవకాశాలపై రెవెన్యూ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డిని మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు.

ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం

నల్లబెల్లి : గ్రామాలు, వ్యవసాయ భూములను ముంపునకు గురిచేసేలా రంగాయ చెరువు రీడిజైన్ ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినందుకు మండలంలోని ఆసరవెల్లి గ్రామస్తులు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. లక్ష్మీతండా, ఆసరవెల్లి, మేడపల్లి గ్రామాల రైతులు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్

వర్ధన్నపేట : మండలంలోని కట్ర్యాలకు చెందిన కట్ట రాజు, చెవ్వల రాణి, గండు మల్లేశం, బీరవెల్లి శేఖరయ్య, దుప్పెల్లి ఎలీషా, నాంపెల్లి అవినాశ్, షేక్ రహీనాలకు ఎమ్మెల్యే నాగరాజు నివాసంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బండారి సతీశ్ శనివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సతీశ్ మాట్లాడారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు లబ్ధిదారులకు చెక్కులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరుకుడు వెంకటయ్య, తీగల సునీత, కొండబేటి మధూకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ బీమా చెక్కు అందజేత

సంగెం : మండలంలోని ఎల్గూర్ రంగంపేటకు చెందిన వల్లెపు రాజు ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందగా ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ నుంచి మంజూరైన రూ.20 లక్షల బీమా చెక్కును అతడి సతీమణి కవితకు గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ సుల్తాన్ వెంకయ్య శనివారం అందజేశారు. అనంతరం మేనేజర్ మాట్లాడారు. రాజు గ్రామీణ వికాస్ బ్యాంకులో ఖాతా కలిగి ఉండి ఎస్‌బీఐ జనరల్ ఇన్స్‌రెన్స్ చేశాడని తెలిపారు. ఈ క్రమంలో రాజు రైలు ప్రమాదంలో మృతి చెందడంతో మంజూరైన బీమా డబ్బును నామినీ అయిన కవితకు అందజేసినట్లు చెప్పారు. క్యాషియర్ విష్ణు, బ్యాంకు ఉద్యోగి రాజు, పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

- ఎస్సై కొంక అశోక్
- పీహెచ్‌సీ ఆవరణలో 'అమ్మ పేరుతో మొక్క నాటాలి' కార్యక్రమం
- హాజరైన అంగన్‌వాడీ సిబ్బంది



దామెర : మొక్క నాటుతున్న ఎస్సై అశోక్

దామెర : మండలంలోని ప్రతిఒక్కరూ అమ్మ పేరుతో మొక్కలు నాటి సంరక్షించాలని ఎస్సై కొంక అశోక్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్క నాటారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పెరటి తోటలో, ఇంటి ఆవరణలో పండ్లు, పూల మొక్కలు నాటాలని అన్నారు. నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాలని వెల్లడించారు. మానవ మనుగడకు మొక్కలే ఆధారమన్నారు. నేటి నుంచి నిర్వహించే పోషణమాసం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ మంజుల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి, అంగన్‌వాడీ టీచర్లు శోభారాణి, వాణి, కోమల, జ్యోతి, పుష్పలీల, వనజ, రజిత, గౌరీ, జయ, సులోచన, రేణుక, ఫాతిమా, సంధ్య, రమ, సరళతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు, విశ్రాంత అటవీ శాఖ అధికారి పురుషోత్తం పిలుపునిచ్చారు. మండలంలోని ఉనికిచర్లలో గల శ్రీనివాస రామానుజన్ కాన్సెప్ట్ స్కూల్‌లో శనివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతిఒక్కరికీ పర్యావరణం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరోగ్యకరమైన పర్యావరణం సమాజానికి పునాదిలాంటిదని, దానిని సంరక్షించుకోవడం అందరి బాధ్యత అన్నారు. మొక్కల పెంపకంతోనే పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. పాఠశాల ఉపాధ్యాయుడు గోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ధర్మసాగర్ : మాట్లాడుతున్న పురుషోత్తం

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ సంతోశ్

ఆత్మకూరు : విద్యార్థులు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ సంతోశ్ సూచించారు. మండల కేంద్రంలోని సెయింట్ థెరిస్సా స్కూల్‌లో శనివారం మత్తు పదార్థాలపై నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత సన్మార్గంలో పయనించాలన్నారు. చెడు మార్గంలోకి వెళ్లకూడదని సూచించారు. చదువుపై శ్రద్ధ వహించాలని, చెడు స్నేహానికి దూరంగా ఉండాలన్నారు. విద్యార్థి దశలో కష్టపడి చదివితే మిగతా జీవితం పూలపాన్పు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ జాయ్, వైస్ ప్రిన్సిపాల్ రోస్‌విలా, కరస్పాండెంట్ లిస్‌మేరియా తదితరులు పాల్గొన్నారు.

'బిట్స్'లో మాక్ పోలింగ్ సందడి



మాక్‌పోలింగ్‌లో భాగంగా ఓటుహక్కు వినియోగించుకుంటున్న విద్యార్థిని



ఎన్నికల అధికారి (ప్రిన్సిపాల్)కు పోలీసుల వేషధారణలో బందోబస్తు కల్పిస్తున్న విద్యార్థులు

పరకాల : పట్టణంలోని బిట్స్ పాఠశాలలో చేపట్టిన మాక్ పోలింగ్‌తో సందడి నెలకొంది. మాక్ పోలింగ్‌లో భాగంగా విద్యార్థులు పాఠశాల ఎస్‌పీలుగా, సీఎస్‌పీలుగా నామినేషన్ దాఖలు చేశారు. ఉపాధ్యాయులు ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తూ అభ్యర్థులకు గుర్తులను కేటాయించారు. పోలింగ్‌లో పాల్గొని ఓటు వేసేందుకు బారులుదీరినట్లు ఉండటంతో విద్యార్థులు చేపట్టిన పోలీసు బందోబస్తు ఆకట్టుకుంది. ఓటు వేసిన తర్వాత వారిలో ఎనలేని సంతోషం కనిపించింది. అయితే బిట్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తు ఓటు రాజ్యాంగం కల్పించినటువంటి హక్కు అని, భవిష్యత్‌లో ప్రలోభాలకు లొంగకుండా సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యుగేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏకలవ్య భవనానికి స్థలం కేటాయించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వేలేరు : తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం (ఏకలవ్య) భవనానికి మండల కేంద్రంలో 5 గుంటల స్థలం కేటాయించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మానుపాటి రమేశ్ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ హెచ్.కోమికి శనివారం వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. మండలంలోని పందుల పెంపకందారుల సహకార సంఘానికి గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పులిచేరు సారయ్య, మండల ప్రధాన కార్యదర్శి సంపత్, నాయకులు రమేశ్, సారయ్య, రాజశేఖర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



పైపులైన్ మరమ్మతు చేయరూ..

మండలంలోని సూరారంలో గల 5వ వార్డులో తాగునీటి పైప్‌లైన్ లీకేజీ అయ్యి నీరు కలుషితమవుతోంది. దీంతో దగ్గు, జలుబుతో పాటు వ్యాధులకు గురవుతున్నామని స్థానికులు మొరపెట్టుకుంటున్నారు. అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలంటున్నారు.

- ఎల్కతుర్తి

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
నవీన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి
ఫోన్‌నంబర్ : 8074498606

మస్టర్ల కొట్టివేతపై గ్రామసభలో చర్చ



గ్రామస్తుల నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

శాయంపేట : ఉపాధి హామీ సామాజిక తనిఖీ సభ్యులు నిర్వహించిన గ్రామసభలో మస్టర్ల కొట్టివేతపై వాడీవేడిగా చర్చ జరిగింది. 2023–2024 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై మండలంలోని ప్రగతి సింగారం గ్రామంలో శనివారం 15వ సామాజిక తనిఖీ చేపట్టగా తనిఖీ సభ్యులు ఉపాధి హామీ పనుల రికార్డులను పరిశీలించారు. పనులపై విచారణ చేపట్టి, కూలీలతో మాట్లాడారు. ఆయా గ్రామ సభల్లో ఉపాధి పనుల్లో జరిగిన పొరపాట్లను చదివి వినిపించారు. సూర్యనాయక్‌తండాలో కూలీల మస్టర్ల కొట్టివేతపై తనిఖీ సభ్యులు ఆరా తీశారు. ఏపీఓ కీర్తి అనిత, డీఆర్‌పీ కిరణ్, ఎస్సార్పీ నాగరాజు పాల్గొన్నారు.

పంటసాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలి

మండల వ్యవసాయశాఖ అధికారి రాకేశ్



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ రాకేశ్

దామెర : పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు పాటించాలని ఏఓ రాకేశ్ సూచించారు. మండలంలోని పులుకుర్తిలో పత్తి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రసంపీల్చు పురుగు, తెల్లదోమ ఉధృతి, సూక్ష్మధాతు లోపం లక్షణాలను గుర్తించడం జరిగిందన్నారు. రసంపీల్చే పురుగుల నివారణ కోసం అర మిల్లీ లీటర్ మోనో క్రొటోఫాస్, 2 మి.లీ మిథైల్ డెమటాస్, 0.4 గ్రా. ఇమిడాక్లోప్రిడ్, 0.2 గ్రా.ఎసిటామిప్రిడ్, 0.2 గ్రా. థయోమిథాక్సామ్, 1.5 గ్రా. ఎసిఫేట్ ఒక దానిని లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని అన్నారు. తెల్లదోమ నివారణలో భాగంగా 2 మి.లీ. ట్రైజోఫాస్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ లేదా 5.0 మి.లీ. వేపనూనె లీటర్ నీటిలో కలిపి ఆకుల అడుగు భాగం తడిసేలా పిచికారీ చేయాలని అన్నారు. సూక్ష్మధాతు లోపం నివారణకు మల్టీకే 500 గ్రాములు ఒక ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. ఏఈఓ రామకృష్ణ, రైతులు వేణుగోపాల్, రాజు, రాంబాబు, రామ్‌చంద్రు, సరిత పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అవమానం భరించలేక యువకుడి ఆత్మహత్య

శాయంపేట : అత్తామామ, బంధువులు అవమానించారనే మనస్థాపంతో పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గణపురం మండలం వీరయ్యపల్లి గ్రామానికి చెందిన బుర్ర సతీశ్ (35) భార్య విజయ రాఖీ పౌర్ణమి పండుగకు తన సోదరుడికి రాఖీ కట్టేందుకు పెద్దకోడెపాకకు వెళ్లింది. రాఖీ పండుగ మరుసటి రోజు సతీశ్ భార్యను తీసుకొచ్చేందుకు పెద్దకోడెపాకలోని అత్తగారింటికి వెళ్లాడు. భార్య విజయ, అత్తా, మామ మూల నర్సయ్య, వనమాల, తోటి అల్లుడు తడక రాజు, వదిన మంజుల, బావమరిది భార్య శ్యామల అసభ్యకరంగా మాట్లాడడంతో సతీశ్ మనస్థాపానికి లోనయ్యాడు. దీంతో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. కాగా సతీశ్ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి తల్లి బుర్ర రాధ ఫిర్యాదు మేరకు భార్య విజయ తరుపు బంధువులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

పరకాల : మద్యం మత్తులో భార్యతో గొడవపడి క్రిమిసంహారక మందుతాగిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. పరకాల మండలం పోచారం గ్రామానికి చెందిన ఇప్ప శంకర్ (52) ఇటీవల మద్యం మత్తులో భార్యతో గొడవపడి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న శంకర్.. పరిస్థితి విషమించి శనివారం కన్నుమూశాడు. మృతుడి కుమారుడు రాకేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పరకాల సీఐ క్రాంతికుమార్ వెల్లడించారు.

డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు

ఆత్మకూరు : బైక్‌ను ఢీ కొట్టిన డీసీఎం డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్‌కు చెందిన తడుగుల రమేశ్ నీరుకుళ్లలో ఓ శుభకార్యానికి హాజరై శనివారం తిరిగి వరంగల్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో పెద్దాపూర్ సమీపంలో డీసీఎం వాహనం అతివేగంతో వచ్చి రమేశ్ బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రమేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి భార్య సంధ్యారాణి ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్ ఆరిఫ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పరమేశ్వర్ తెలిపారు.

రెండు మేకల అపహరణ

వేలేరు : ఇంటిలో కట్టేసి ఉంచిన రెండు మేకలను దొంగలు అపహరించారు. ఈ సంఘటన మండలంలోని లోక్యాతండాలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మురావత్ రాజు, అతడి భార్య కవిత గత నెల 28వ తేదీన తనకున్న ఒక ఆవు, రెండు మేకలు ఇంటిముందు ఉన్న షెడ్డులో కట్టెసి ఓ వివాహానికి పొరుగూరికి వెళ్లారు. రాత్రి 11 గంటలకు తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఉదయం చూసే సరికి రెండు మేకలు కనిపించలేదు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అపహరణకు గురైన మేకల విలువ రూ.18వేలు ఉంటుందని బాధితుడు రాజు తెలిపారు. దొంగలను గుర్తించాలని కోరారు.

బీజేపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి

- రాష్ట్ర నాయకుడు కాళీప్రసాదరావు



దామెర : మాట్లాడుతున్న కాళీప్రసాదరావు



ఎల్కతుర్తి: మాట్లాడుతున్న లక్కిరెడ్డి తిరుమల

దామెర : మండలంలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని రాష్ట్ర నాయకుడు డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు సూచించారు. మండలంలోని ల్యాదెళ్లలో ముఖ్యకార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి సభ్యత్వ నమోదుపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదు ద్వారానే క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం అవుతుందని అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదులో దామెర మండలాన్ని జిల్లాలోనే మొదటిస్థానంలో నిలపాలని అన్నారు. సభ్యత్వ నమోదు ప్రముఖ్‌గా బీజేవైఎం నాయకుడు సూర చందర్, సహ ప్రముఖ్‌గా గండు ముఖేష్‌గౌడును నియమించారు. నియోజకవర్గ కన్వీనర్ ముల్క ప్రసాద్, కోకన్వీనర్ మాదారపు రతన్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజ్‌కుమార్, గన్ను సతీష్, కిసాన్ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిరెడ్డి, నాయకులు గోగుల సమ్మిరెడ్డి, కొట్టె రాజు, శక్తి కేంద్రం ఇంచార్జ్‌లు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : భారతీయజనతా పార్టీ చేపట్టే రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం హుస్నాబాద్ నియోజకవర్గ ప్రముఖ్ లక్కిరెడ్డి తిరుమల పిలుపునిచ్చారు. శనివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు పైడిపెల్లి పృధ్వీరాజ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సెప్టెంబర్ 2న ప్రధాని మోదీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ప్రారంభించనున్నారని చెప్పారు. మండల, గ్రామస్థాయిలో కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా పనిచేసి అత్యధిక సభ్యత్వాలను నమోదు చేయించాలని సూచించారు. మండల ఇన్‌చార్జ్ సతీష్, జిల్లా కార్యదర్శి కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు రాము, రవీందర్, శివ, రాజు, కవిత, సాయి, మల్లారెడ్డి, అనిల్, రమేశ్, వైకుంఠం పాల్గొన్నారు.

కళాశాలల్లో సీట్ల సంఖ్య పెంచాలి

నర్సంపేట : పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కళాశాలల్లో సీట్ల సంఖ్య పెంచాలని కోరుతూ ఏబీఎస్ఎఫ్, ఏఐఎఫ్‌డీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మాధవరెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు.

పరకాల : పట్టణంలో కురుస్తున్న భారీ వర్షం



పరకాల : హనుమకొండకు వెళ్లే రోడ్డులో నిలిచిన వరదనీరు



మోస్తరు వర్షం..

వివిధ మండలాల్లో శనివారం మోస్తరు వర్షం కురిసింది. పరకాల పట్టణంలో భారీ వర్షం పడగా రహదారులు జలమయమయ్యాయి. ప్రజలు, వాహనదారులు బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా దుకాణాలు మూతపడ్డాయి. ఉదయం నుంచి మోస్తారు వర్షం కురువగా సాయంత్రం భారీ వర్షం కురిసింది.

- సాక్షి నెట్‌వర్క్



హనుమకొండలో కురుస్తున్న వర్షం

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

వేలేరు : మండల కేంద్రంతో పాటు కమ్మరిపేట గ్రామానికి చెందిన ఇట్టబోయిన రమ, బర్మావత్ రాహుల్‌కు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మాజీ జెడ్పీటీసీ చాడ సరిత, మాజీ వైస్ ఎంపీపీ అంగోతు సంపత్ శనివారం లబ్ధిదారులకు అందించారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న ఇరువురు ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం పొందారు. ఆర్థికంగా ఆదుకోవాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. స్పందించి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సీఎం సహాయనిధి నుంచి రమకు రూ.42వేలు, రాహుల్‌కు రూ.60వేల చెక్కులను మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ వేలేరు గ్రామ కన్వీనర్ భూపతిరాజ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సంపత్, జీవన్, రాజు తదితరులు అందించినవారిలో ఉన్నారు.

రక్తదానం చేసిన యువకులు



కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో రక్తం అత్యవసరం కాగా మండల కేంద్రానికి చెందిన లోకనవేని గణేశ్, మండ ప్రశాంత్ శనివారం రక్తదానం చేశారు. రక్తదాతలు ప్రాణ ప్రదాతలని ప్రగతి యువజన సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పబ్బు సతీశ్ సూచించినందున మండల కేంద్రానికి చెందిన మొగిలిచెర్ల ప్రశాంత్ చొరవతో రక్తదానం చేసేందుకు ముదుకొచ్చినట్లు వారు తెలిపారు. పలువురు గ్రామస్తులు అభినందించారు.